మద్యం మత్తులో పల్లెలు చిత్తు

- ఏరులై పారుతున్న మద్యం
- పల్లెల్లో తిష్ట వేసిన బెల్ట్ షాపులు
- షాపులు లేవంటున్న ఎక్సైజ్ అధికారులు

పెదవేగి: మద్యం బెల్ట్ దుకాణాలను నిషేధించామని చెబుతూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోంది. మండలంలోని పల్లెల్లో బెల్ట్ దుకాణాలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా మద్యం ఏరులై ప్రవహిస్తోంది. ఇంత జరుగుతున్నా, జిల్లా ఎక్సైజ్ అధికారులు బెల్ట్ షాపులను పూర్తిగా నిరోధించామంటూ చెబుతూ ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారు. పెదవేగి మండలంలో రామచంద్రపురం, పెదవేగి, కవ్వగుంట, విజయరాయి, వేగివాడ, ముండూరు, కూచింపూడి, కొప్పాక, రాట్నాలకుంట మొత్తం 9 మద్యం దుకాణాలను ప్రభుత్వం నిర్వహిస్తుంది. పెదపాడు మండలంలో వట్లూరు, కలపర్రు, అప్పనవీడు, పెదపాడులో 2 మొత్తం 5 షాపులు, దెందులూరు మండలంలో రామారావుగూడెం, దెందులూరు, కొవ్వలి, గోపన్నపాలెం, పోతునూరు, మొత్తం 5 షాపులకు ప్రభుత్వం లైసెన్సులు ఇచ్చి నిర్వహిస్తుంది. మిగిలిన దుకాణాలను దరఖాస్తులు, లైసెన్స్ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేవే. వీటి నిర్వహణలో నిబంధనలను ఖాతరు చేయకుండా నిర్వాహకులు మద్యం విక్రయిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం దుకాణదారులు ఎక్కడా బెల్ట్ షాపులను ఏర్పాటు చేయకూడదు. ప్రభుత్వం బెల్ట్ షాపులపై నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించింది. కానీ మద్యం వ్యాపారులు నిబంధనలను తూట్లు పొడుస్తూ విచ్చలవిడిగా గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామంలో 8 నుంచి 10 దుకాణాలు ఏర్పాటు చేసి నడిపిస్తున్నారు. మండల కేంద్రమైన పెదవేగిలో బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడంతో మద్యం ఏరులై పారుతుంది. మండలంలోని బి.శింగవరం, కూచింపూడి, కొప్పాక, రామశింగవరం, రాట్నాలకుంట, వేగివాడ, నడిపల్లి, భోగాపురం, అమ్మపాలెం, దిబ్బగూడెం, నాగన్నగూడెం, జానంపేటలో గొలుసు దుకాణాలు ఏర్పాటయ్యాయి. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే మిగిలిన ప్రాంతాల్లో ఎలా ఉంటుందో ఊహించవచ్చు. బెల్ట్ షాపుల్లో లూజు, చీప్ లిక్కర్ విక్రయాలు బహిరంగానే సాగుతున్నాయి. ఎక్సైజ్ అధికారులకు అన్నీ తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి బెల్టు షాపులను పూర్తిగా తొలగించాలని మండల వాసులు, మహిళలు ముక్త కంఠంతో వేడుకుంటున్నారు.


బి.శింగవరంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపు


రామచంద్రపురం ప్రధాన రహదారిలో పచ్చని గుడ్డ కట్టి బహిరంగంగా విక్రయిస్తున్న మద్యం


బెల్ట్ షాపు వద్ద డెమో మద్యం బాటిళ్లు ఇలా..

కుటుంబంలో శాంతి లేదు

మా ఇంటి సమీపంలో బెల్ట్ షాప్ ఉంది. మా ఆయన నిరంతరం వాళ్ల దగ్గర అప్పులు చేసి మరీ తాగేస్తున్నాడు. ఆ ప్రభావంతో ఇంటిల్లిపాది నరకం వెల్లబోస్తున్నాం. కూలికి వెళితే కాని గడవని పరిస్థితి మాది. ఎదిగిన ఇద్దరు ఆడ పిల్లలతో బాధ్యత లేని తాగుబోతు భర్తతో కుటుంబంలో శాంతి లేదు. ఈ బెల్టు షాపులపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సీహెచ్ సునీత, గ్రామస్తురాలు, విజయరాయి

గ్రామాల్లో బెల్ట్ షాపులకు అడ్డే లేదు

గ్రామాల్లో మద్యం దుకాణాలు మితిమీరిపోయాయి. దీనిపై ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. పెద్ద దుకాణాల్లో అయితే సొమ్ములు చెల్లిస్తే కాని, మద్యం ఇవ్వరు, కాని ఈ బెల్ట్ షాపుల్లో అప్పులు ఇచ్చి మరీ తాగుబోతులను పెంచి పోషిస్తున్నారు. తద్వారా ఆయా కుటుంబాల్లో తరచూ గొడవలు వస్తున్నాయి. అధికారులు చొరవ చూపాలి.

– బలుసు మణికుమార్, ముందూరు గ్రామపెద్ద

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు: ఉంగుటూరు సెక్షన్ నారాయణపురం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి నిడమర్రు సబ్‌స్టేషన్‌కు ఆర్‌డీఎస్ఎస్‌లో కొత్తగా విద్యుత్ ఫీడర్‌ను నిర్మించనున్నారు. ఈ పనుల నిమిత్తం ఈ నెల 11వ తేదీ సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నారాయణపురం సబ్‌స్టేషన్ పరిధిలోని బాదంపూడి ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ అంబేద్కర్ తెలిపారు. దీని వలన రాచేరు, సీతారామపురం, రావులపర్రు గ్రామాలతో పాటు ఆయా గ్రామాల పరిధిలోని ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఎర్రమల్ల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద భారీ గాలుల కారణంగా పడిపోయిన విద్యుత్ లైన్ పునరుద్ధరణ పనుల కారణంగా నాచుకుంట, కొత్తగూడెం గ్రామాలకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌కు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి ఇంటర్నల్ పరీక్షలు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో ఈ నెల 11 నుంచి 18 వరకు ఇంటర్నల్ పరీక్షలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియల్ అన్నారు. ఆదివారం కళాశాలలో ఆయన ఇంటర్నల్ పరీక్షల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీఈడీ, యూజీడీ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న అధ్యాపక విద్యార్థులకు వారం రోజుల పాటు ఇంటర్నల్ పరీక్షలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

దెందులూరు: ఇంద్రవరం వద్ద ఉన్న శ్రీఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు సంపెంగ అప్పారావు, సంపెంగ సతీష్, సంపెంగ గణేష్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో మహా అన్నసమారాధన నిర్వహించారు.

బస్సును ఢీ కొట్టిన లారీ


బస్సును వెనుక నుంచి ఢీ కొట్టిన లారీ

దెందులూరు: జాతీయ రహదారిపై కొమరేపల్లి వద్ద ఆదివారం సీతంపేట వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక భాగం, లారీ ముందు భాగం దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాల్లో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

నులిపురుగుల నివారణ సమష్టి బాధ్యత


నులిపురుగు నివారణ కరపత్రాలను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: నులిపురుగుల నివారణ సమష్టి బాధ్యతని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ నెల 12 నుంచి ప్రారంభమయ్యే నులిపురుగుల నివారణ కార్యక్రమంపై పీహెచ్‌సీ పరిధిలో పాఠశాలలు, అంగన్‌వాడీల్లో అవగాహన కల్పించారు. నులిపురుగుల నివారణ కరపత్రాలను, వాల్ పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 3000 పైగా నులిపురుగుల నివారణ టాబ్లెట్లను ఇప్పటికే వైద్య, ఆశా సిబ్బంది పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేశామన్నారు. వీటిని 12 తేదీన పంపిణీ చేస్తామని చెప్పారు.

గంగానమ్మకు సారె సమర్పణ


గంగానమ్మకు సారెను తీసుకెళుతున్న గ్రామస్తులు

దెందులూరు: మండలంలోని కొవ్వలి గ్రామంలో ఆదివారం గంగానమ్మకు గ్రామస్తులు చీర, సారె, పసుపు కుంకాలు, దీప ధూప నైవేద్యాలు సమర్పించారు. శ్రావణమాసం ఆదివారం పురస్కరించుకొని కొవ్వలి గ్రామ దేవతగా పూజలు అందుకుంటున్న శ్రీగంగానమ్మకు అభిషేకాలు చేసి, పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

రెండు సొసైటీలకు త్రీమెన్ కమిటీలు

దెందులూరు: మండలంలో జాగన్నపాలెం కో–ఆపరేటివ్ సొసైటీకి చైర్మన్‌గా డాక్టర్ బి.మధు, మెంబర్లుగా కామిరెడ్డి ధర్మచౌదరి, సిరిసిల్ల రంగారావు నియమితులయ్యారు. గాలాయిగూడెం కో–ఆపరేటివ్ సొసైటీకి పూజారి వెంకటరత్నం నాయుడు చైర్మన్ మండూరి బుజ్జి, గోపాల్, అక్కినేని కుచేంద్ర మెంబర్లుగా నియమితులయ్యారు. ఈ మేరకు సొసైటీలకు ఆదేశాలు జారీ అయ్యాయి.

బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడిగా బైగాని


రంగారావును సత్కరిస్తున్న సంఘ సభ్యులు

పెదవేగి: ఏలూరు జిల్లా బీసీ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పెదవేగి మండలం విజయరాయికి చెందిన న్యాయవాది బైగాని రంగారావును నియమించినట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఏపీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు విటల్‌కుమార్, ఏపీ గౌడ సేవా సమితి చైర్మన్ బాలకృష్ణ పాల్గొన్నారు.

వైభవోపేతంగా శ్రీకృష్ణ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ


శ్రీకృష్ణుడిని దర్శించుకుంటున్న భక్తులు

భీమడోలు: భీమడోలు శివాలయం వద్ద పునర్నిర్మించిన శ్రీకృష్ణదేవాలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. దాతల ఆర్థిక సాయంతో సుందరంగా నిర్మించిన ఈ దేవాలయంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు ప్రవేశం కల్పించారు. నాలుగు దశాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించే వారు. కాలక్రమేణ ఆలయ ప్రాంతం పల్లంగా ఉండడంతో వర్షాకాలంలో నీరు చేరి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో దాతలు ఈడే సత్యనారాయణ, గిరిబాబు ఆర్థిక సాయంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఆలయానికి రంగులు వేసి సుందరంగా ముస్తాబు చేశారు. పరిసర గ్రామాల్లోని భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తొలుత దాత ఈడే సత్యనారాయణ మాట్లాడుతూ ఈ దేవాలయంలో పూజలు చేస్తే కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసమని, కొత్తగా పెళ్లైయిన జంట స్వామి వారిని దర్శించుకుంటే తొలి సంతానం మగ బిడ్డ పుడతాడన్న నానుడి ఉందన్నారు.

ఉచిత బస్సు పూర్తిగా అమలు చేయాలి


వేద కుమారి

దెందులూరు: ఉచిత బస్సు హామీ ఇచ్చినట్టుగానే రాష్ట్రమంతా అమలు చేయాలని సూపర్ సిక్స్ హామీల మాదిరిగా అరకొరా చేస్తే నిరసనలు, ఆందోళనలు చేపడతామని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి తోత్తడి వేదకుమారి అన్నారు. ఆదివారం దెందులూరులో ఆమె నివాసంలో మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల ముందు ఉచిత బస్సు హామీ రాష్ట్రమంతా వర్తింపజేస్తాం, ఎవరైనా అడిగితే నా పేరు చెప్పండని చంద్రబాబు అనేక సభల్లో చెప్పారన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినప్పటికీ నేటికీ ఉచిత బస్సు అమలు చేయకపోవడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఇచ్చిన హామీలతో పాటు చెప్పని అనేక పథకాలు అమలు చేసి దేశమంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ఏపీని నంబర్ వన్‌గా తీర్చిదిద్దారన్నారు. ఉచిత బస్సు పథకంపై మంత్రులు ఒకలా అధికారులు మరోలా ముఖ్యమంత్రి వేరేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఉచిత బస్సు పథకంపై కూటమి నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు రాష్ట్రమంతా అమలు చేయకపోతే వైఎస్సార్ సీపీ మహిళా విభాగాలు సమష్టిగా పోరాటం చేస్తామన్నారు.

భక్తుడికి గాయాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన జంటగోపురాల ప్రాంతంలో కళ్లు తిరిగి పడిపోవడంతో ఓ భక్తుడికి గాయాలయ్యాయి. విజయవాడలోని గొల్లపూడికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ ఎం.సుబ్బారావు ఆదివారం కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. బయటకు వచ్చే క్రమంలో అనివేటి మండపంలో కళ్లు తిరిగి పడిపోవడంతో స్వల్పంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు, భక్తుల సహాయంతో జంటగోపురాల ప్రాంతానికి చేరుకుని అక్కడ మరోసారి పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు ఆలయ ప్రథమ చికిత్సా కేంద్రానికి తరలించి, చికిత్స అందించారు.

కూల్‌డ్రింక్స్ లారీ బోల్తా


కలపర్రు సమీపంలో జాతీయ రహదారిపై బోల్తా పడిన కూల్‌డ్రింక్స్ లారీ

ఏలూరు టౌన్: ఏలూరు జాతీయ రహదారిపై పెదవేగి మండలం కలపర్రు టోల్‌ప్లాజా సమీపంలో కూల్‌డ్రింక్స్ లోడ్‌తో వెళుతోన్న ట్రాలీ లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ నుంచి విశాఖపట్నం ప్రాంతానికి మినిట్ మెయిడ్ పల్పీ ఆరెంజ్ కూల్‌డ్రింక్ బాటిల్స్ లోడుతో ట్రాలీ లారీ బయలుదేరింది. ఈ లారీ కలపర్రు కొక్కిరపాడు వంతెన సమీపానికి చేరుకునేసరికి ఆకస్మికంగా అదుపుతప్పి డివైడర్ ఎక్కి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ పరారవ్వగా, 108 సిబ్బంది ప్రమాదస్థలానికి చేరుకుని క్లీనర్‌కు ప్రాథమిక చికిత్స అందించారు. హైవే పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జాతీయ జెండా స్ఫూర్తిని నింపాలి



తెల్లంవారిగూడెంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ చేస్తున్న పీఓ, అధికారులు

బుట్టాయగూడెం: దేశ సార్వభౌమత్వానికి, ఆత్మగౌరవానికి ప్రతీక మన మువ్వన్నెల జాతీయ జెండా అని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె.రాములు నాయక్ అన్నారు. మండలంలోని తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఆదివారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశభక్తికి, సమగ్రతకు, జాతీయ భావానికి, ఐక్యతకు ప్రతిబింబంగా మూడు రంగుల పతాకం నిలుస్తుందని అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఒక్కరిలో జాతీయ జెండా స్ఫూర్తిని నింపాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీడీ ఎస్.శ్రీవిద్య, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ ఈఈ టి.లత, ఏటీడబ్ల్యూఓ జె.జనార్దన్, ఏఎంఓ కె.శిరమయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి


నియామక పత్రం అందజేస్తున్న జిల్లా రజక సంఘం అధ్యక్షుడు

గణపవరం: సామాజికంగా, ఆర్థికంగా వెనుబడిన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, ఆంధ్రప్రదేశ్ రజక చైతన్య సేవా సంస్థ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు జొన్నాడ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సరిపల్లెలో నిర్వహించిన మండల రజక సంఘం విస్తృత సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ–ఏ జాబితాలో ఉన్న రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని మూడు దశాబ్దాలుగా రజకులు కోరుతున్నారన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. రజకుల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు అవసరమన్నారు. ఈ సందర్భంగా గణపవరం మండల నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడిగా బుద్దారపు పుల్లయ్య, ఉపాధ్యక్షుడిగా జొన్నాడ కొండయ్య, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పెంటపాడు, తణుకు, ఉంగుటూరు మండలాల రజక సంఘం అధ్యక్షుడు అంజూరి శ్రీనివాస్, కొత్తపల్లి గోవర్ధన్, వెలుదూరి శ్రీనివాస్, పిప్పర ప్రసాద్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పది మంది జూదరుల అరెస్ట్

ద్వారకాతిరుమల: మండలంలోని మలసానికుంటలో ఆదివారం సాయంత్రం ఒక కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 10 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,770 నగదు, 8 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

జంగారెడ్డిగూడెం: స్థానిక జేపీ సెంటర్‌లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఐదుగురిని అరెస్ట్ చేసి, రూ.4,100 స్వాధీనం చేసుకున్నామన్నారు.

వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీ పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా కొప్పుల నాగేశ్వరరావు(నాగు) ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక శ్రీశ్రీ ఫంక్షన్ హాలులో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు నాగేశ్వరరావుతో ప్రమాణస్వీకారం చేయించారు. పట్టణ అనుబంధ విభాగాలకు ఎంపికైన పార్టీ ప్రతినిధులు, మండల కమిటీ ప్రతినిధులను సత్కరించారు.

విద్యార్థులకు అసెస్‌మెంట్ పుస్తకాల్లోనే పరీక్షలు

- నేటి నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు
- బుక్‌లెట్‌లోనే జవాబులు రాయాల్సిన వైనం


గణపవరం: ఈ విద్యా సంవత్సరంలో మొట్ట మొదటి పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించడానికి విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సారి పరీక్ష రాసే విధానంలో మార్పులు తీసుకొచ్చింది. ఒకటి నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులు జవాబు పత్రాలకు బదులుగా బుక్‌లెట్‌లోనే జవాబులు రాయాల్సి ఉంటుంది. ఇప్పటికే అన్ని సబ్జెక్టులకు సంబంధించి అసెస్‌మెంట్ పుస్తకాలు విద్యార్థుల రోలు ప్రకారం ఆయా పాఠశాలలకు మండల వనరుల కేంద్రం నుంచి సరఫరా చేశారు. ప్రతి విద్యార్థికి ఒక్కో సబ్జెక్ట్‌కు సంబంధించి ఒక్కో పుస్తకాన్ని అందించనున్నారు. అంటే ప్రాథమిక స్థాయిలో నాలుగు అసెస్‌మెంట్ పుస్తకాలు, 6, 7, 8 తరగతులకు ఆరు అసెస్‌మెంట్ పుస్తకాలు, 9, 10 తరగతులకు 7 సబ్జెక్టులకు ఏడు అసెస్‌మెంట్ పుస్తకాలను అందించనున్నారు. ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించే నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలకు సంబంధించి జవాబులన్నీ ఈ ప్రత్యేక బుక్‌లెట్‌లోనే రాయాల్సి ఉంటుంది. ఈ మార్కులను హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేసి విద్యార్థులకు అందించనున్నారు. ఈసారి మార్కులను ప్రత్యేకంగా ఉపాధ్యాయులు వేయాల్సిన అవసరం ఉండదు. ఓఎంఆర్‌షీట్‌లో మార్కులు నమోదు చేసి స్కాన్ చేయగానే ఆటోమేటిక్‌గా యాప్‌లో నమోదవుతాయని, ఈ మార్కులు సేవ్ చేయబడతాయని విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు.


విద్యార్థులు పరీక్షలు రాయవలసిన అసెస్‌మెంట్ పుస్తకాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
గణపవరం	55	3519
నిడమర్రు	40	2399
ఉంగుటూరు	66	4581
భీమడోలు	42	3616

వివరాలు ఇలా..

ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలలోని 203 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిలో 14,115 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సోమవారం నుంచి జరిగే ఫార్మేటివ్ బుక్‌లెట్‌లపై ఇప్పటికే ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అసెస్‌మెంట్ పుస్తకాల్లో పరీక్ష రాయడం ఉపాధ్యా యులపై విపరీతమైన పనిభారం పెరగు తుందని, పుస్తకాలు దిద్దడం పెద్ద సమస్య కానుందని అంటున్నారు. పరీక్ష పేపర్ కట్టలను ఇంటికి తీసుకెళ్లి తీరిక సమయంలో దిద్దేవారమని, ఇప్పుడు పుస్తకాల కట్టలు ఇంటికి తీసుకెళ్లే పరిస్థితి ఉండదని, పాఠశాలలో దిద్దడం వలన బోధనకు ఆటంకం కలుగుతుందని అంటున్నారు.



పదో తరగతి ఫిజికల్ సైన్స్ సబ్జెక్ట్ అసెస్‌మెంట్ బుక్‌లెట్

పరీక్షలకు సర్వం సిద్ధం

ఈ విద్యా సంవత్సరంలో పరీక్షల విధానంలో కొత్త మార్పులు ప్రవేశ పెట్టారు. ఇక నుంచి విద్యార్థులకు జవాబులు రాయడానికి ప్రత్యేక పుస్తకం ఇస్తున్నాం. ఈ పుస్తకం విద్యా సంవత్సరంలో జరిగే అన్ని పరీక్షలకు ఉపయోగించాలి. పరీక్షల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు ఏ మేరకు మెరుగవుతుందనే విషయాన్ని అంచనా వేయడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది. కొత్త విధానంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాం.

– యర్రంశెట్టి శేషగిరిరావు, ఎంఈవో–2

ఇద్దరు వ్యక్తులపై దాడి

జంగారెడ్డిగూడెం: దాడి ఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీల్ తెలిపారు. వివరాల ప్రకారం సెంట్రింగ్ పనులు చేస్తున్న బొబ్బిలి వెంకటేష్ వద్ద బంటు రాము హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక సాయిబాలాజి టౌన్‌షిప్ సెంటర్‌లో రాముపై నరేంద్ర, సాయి దాడి చేసి తీవ్రంగా కొట్టారు. విషయం తెలుసుకున్న వెంకటేష్ ఘటనా స్థలానికి చేరుకుని వారిని అడ్డుకోగా వెంకటేష్‌పై కూడా దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడ్డ వీరిద్దరిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.